మంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవ తెలంగాణ-మెదక్ టౌన్ : జిల్లాలో బుధవారం మంత్రి కొండాసురేఖ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ బుధవారం ఉదయం 11 గంటలకు కొల్చారం మండలానికి చేరుకొని జిల్లా పరిషత్ పాఠశాల నందు బడిబాట కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం మండల ప్రజా పరిషత్ భవన సముదాయానికి ప్రారంభోత్సవం చేస్తారని, పోతన శెట్టిపల్లి గ్రామంలో హై లెవెల్ బ్రిడ్జ్ నిర్మాణం కొరకు భూమి పూజ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కౌడిపల్లి మండలం వెలమ కన్నె నుంచి లింగంపల్లి వరకు జడ్పీ రోడ్డు, నర్సాపూర్ మండలం నుండి లక్ష్మణ్ తాండ జడ్పీ రోడ్ నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లిలో తుజలాపూర్ నుంచి విటల్ తండా వరకు జడ్పీ రోడ్లకు శంకుస్థాపన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కొల్చారం ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం, నర్సాపూర్ సాయి కృష్ణ గార్డెన్ నందు కళ్యాణ్ లక్ష్మి లబ్దిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమానికి విజయవంతంగా పూర్తి చేయడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని కలెక్టర్ సూచించారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
మెదక్
1
బుధవారం | 19 జూన్ 2024 | www.navatelangana.com

నీట్ పరీక్షను రద్దు చేయాలి

నవతెలంగాణ-సిద్దిపేట



నీట్ పరీక్షను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ, నరేంద్రమోదీ దిష్టి బొమ్మను ఎన్ఎస్‌యుఐ నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి కొండల్వాడి సతీష్, సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షులు బడికోల్ రాకేష్ యాదవ్‌లు మాట్లాడుతూ నీట్ పరీక్ష అక్రమాల పుట్టగా మారిందని, తక్షణమే పరీక్షను రద్దుచేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ అక్రమాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ప్రధానమంత్రి మోడీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్‌యుఐ నంగునూరు మండల అధ్యక్షులు పిల్లి మహేష్, రూరల్ మండల అధ్యక్షులు గ్యర రఘుపతి, చిన్నకోడూరు మండల అధ్యక్షులు వాసరి అజయ్, నాయకులు సాజిద్, మొగిలి రాకేష్, నరేష్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ.



నవతెలంగాణ-చిలిపిచేడ్

చిలిపిచేడ్ మండల గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు గత ఏడు నెలలుగా అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ డిమాండ్ చేశారు. చిలిపిచేడ్ మండల ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు ప్రజలకు ప్రత్యేక సేవలు అందిస్తున్నారని అతి తక్కువ వేతనంతో ఆరుగాలం శ్రమిస్తున్నారని తక్కువ జీతం కూడా ఏడు నెలలుగా రాకపోవడంతో కార్మికుల కుటుంబాల పోషణకు ఇబ్బంది పడుతున్నారన్నారు. డ్వాక్రా గ్రూపులలో అప్పులు కట్టాలని ఆర్థిక ఇబ్బందులతో కార్మికులు సతమతమవుతున్నారన్నారు. ఏడు నెలల నుంచి డ్యూటీ చేసుకుంటూ ఏమి తినాలి ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, బందేల్లి, మల్లేశం, శేఖర్, యాదయ్య, భిక్ష పతి,రాములు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు సీజ్

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని మాసానిపల్లిలో అక్రమ మట్టి తవ్వకాలపై రెవెన్యూ సిబ్బంది మంగళవారం సాయంత్రం దాడులు చేశారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు మట్టితో ఉన్న టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్టు తహసీల్దార్ భాస్కర్ కుమార్ తెలిపారు. వాటిని పోలీసులకు అప్పగించినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఆర్ఐ మహేందర్ రెడ్డి, సర్వేయర్ సాయి తేజ పాల్గొన్నారు.

ఉచిత బిల్లుకు మరోసారి అవకాశం ..

నవతెలంగాణ-న్యాల్‌కల్

గతంలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ లబ్ది పొందని వారికి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందని ఎంపీడీవో సురేష్ తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీరో కరెంట్ బిల్లు కోసం విద్యుత్ బిల్లు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ప్రజా పాలన రిసిప్ట్‌ను తీసుకెళ్లి ఎంపీడీవో కార్యాలయంలో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకై దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవ తెలంగాణ మెదక్ టౌన్

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు హకీంపేట్, అదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో గల స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాల కొరకు మండల స్థాయి, జిల్లా స్థాయి ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి నాగరాజులు తెలిపారు. అదిలాబాద్ కరీంనగర్ జిల్లాల్లో గల క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాల కొరకు మండల స్థాయి జిల్లా స్థాయి ఎంపికల వివరాలను జిల్లా కలెక్టర్ వివరిస్తూ మండల స్థాయి ఎంపికలు 21 జూన్ 2024 నుండి 25 జూన్ 2024 మధ్యలో ఎదో ఒక్క తేదీలో మండల విద్యాధికారి ఆధ్వర్యంలో పి.డీలు, పి.ఇ.టి.లు, నిర్వహిస్తారని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు తేదీ: 28, 29వ రోజులలో ఉదయం 08.00 గంటల నుంచి ఇందిరా గాంధీ అవుట్ డోర్ స్టేడియం, మెదక్ నందు జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించబడతాయన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన బాలబాలికలకు హకీంపేట్ క్రీడా పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికలలో పాల్గొంటారని చెప్పారు. ఇందుకు కావలసిన అర్హతల గురించి వివరించారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీలలో 4వ తరగతి కొరకు 20 మంది బాలురు, 20 మంది బాలికలను మొత్తం 40 మంది విద్యార్థిని, విద్యార్థులను ఎంపిక చేసి జులై 8, 9వ తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపించడం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి నాగరాజు తెలిపారు. ఇతర వివరాల గురించి మొబైల్ నం. 93473 44440, 8483584388 సంప్రదించాలన్నారు.

నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్



నవ తెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ జిల్లాలో జూన్ 20వ తేదిన నిర్వహించే నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లా కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్, డిస్టిక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, వివిధ మండల వైద్యాధికారులు హాజరయ్యారు. మెదక్ జిల్లాలో నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం జూన్ 20వ తేదిన అన్ని అంగడివాడి కేంద్రాలలో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలలో, మదర్సాలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు అన్ని విద్యాసంస్థలలో ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని, మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత పిల్లలందరికీ మాత్రలు వేయాలని వివరించారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, రెండు నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర , మూడు నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ ఒక మాత్ర నమిలి చప్పరించాలని ఆయన అన్నారు. జూన్ 27న మిగిలిపోయిన పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీ రామ్, ప్రోగ్రాం ఆఫీసలు డాక్టర్ మాధురి, డాక్టర్ విజయనిర్మల, డాక్టర్ అనిలా, డాక్టర్ నవీన్, సహా జిల్లా మలేరియా అధికారి విజయేందర్, లిల్లీ గ్రేస్ పాల్గొన్నారు.

కుంట స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు

నవ తెలంగాణ -దుబ్బాక

కుంట స్థలాన్ని ఆక్రమించి మట్టి పోసిన వ్యక్తిపై దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేశారు.ఎస్సై వీ.గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక మండలం పోతారం గ్రామంలోని వడ్లవాణికుంటలో ఎఫ్ టీఎల్ భూములకు సంబంధించిన చెరువులో అచ్చుమాయిపల్లి గ్రామానికి చెందిన అన్నబోయిన యాదగిరి అనే వ్యక్తి అక్రమంగా మట్టి పోసి చెరువు శిఖం భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోహిత్ శ్రీవాత్సవ ఇచ్చిన ఫిర్యాదు మేరకు యాదగిరి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పెళ్లి చేసుకోవాలని

ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి ధర్నా



నవ తెలంగాణ- దుబ్బాక

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడని ఓ ప్రియురాలు తన కుటుంబ సభ్యులతో కలిసి ఆ ప్రియుడి ఇంటి ముందు ధర్నా చేసిన ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని రామేశ్వరంపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు పల్లె కవిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన పల్లె శ్రీకాంత్‌తో పల్లె కవితకు ఐదేళ్ల క్రితం కాలేజీ చదువుతున్న రోజుల్లో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారి పెళ్లి చేసుకున్నామన్నారని తెలిపారు. అప్పటినుంచి శ్రీకాంత్ పెళ్లి చేసుకుంటానని చెప్తూ తరచూ వాయిదాలు వేస్తూ వచ్చాడన్నారు. ఈ క్రమంలో మంగళవారం ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో నిలదీయగా పెళ్లి చేసుకోవడం కుదరదని శ్రీకాంత్ చెప్పాడని, అందుకే శ్రీకాంత్ ఇంటి ముందు తమ కుటుంబ సభ్యులతో కలిసి టెంట్ వేసి ధర్నాకు దిగడం జరిగిందన్నారు. తమకు వివాహం చేసి న్యాయం చేయాలని పల్లె కవిత విజ్ఞప్తి చేస్తున్నారు.

పల్లె శ్రీకాంత్ వివరణ

అకారణంగా తనపై అబాండాలు వేస్తూ తన కుటుంబాన్ని బజారు కీడుస్తున్నారని, అసలు కవితతో తనకు ఎలాంటి పరిచయంగాని ప్రేమ గాని లేదన్నారు. కవిత స్నేహితురాలి బర్త్ డే అని చెప్పి సిద్దిపేటలోని కోమటి చెరువుకు రప్పించుకొని తనతో బలవంతంగా పూలదండలు మార్పించడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనతో పెళ్లికి ఒప్పుకోవాలని లేదంటే డబ్బులు ఇవ్వాలని పల్లె కవిత, ఆమె కుటుంబీకులు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తుందని బాధితుడు శ్రీకాంత్ ఆరోపిస్తున్నారు. ఇరు కుటుంబాల పెద్దలతో పంచాయితీ పెట్టించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తామెవరూ ఇంట్లో లేని సమయంలో డెలివరీకి సిద్ధంగా ఉన్న తన చెల్లెల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఆ అమ్మాయి తరపున బంధువుల నుంఎతీ తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని శ్రీకాంత్ విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా దుబ్బాక సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో రామేశ్వరం పల్లిలో ఇరు వర్గాలతో చర్చలు జరుపుతున్నారు.

ఆర్వీఎం బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల ధర్నా

నవతెలంగాణ-ములుగు

ఆర్విఎం బీఎస్సీ విద్యార్థులు ధర్నాకు దిగారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్క పల్లి ఆర్ వి ఎం మెడికల్ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న బిఎస్సి విద్యార్థులపై అధ్యాపకులు దుర్భాషలాడుతూ తమకు మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు తరగతులను బహిష్కరించి ఆందోళనకు దిగడంతో కళాశాలలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గత కొన్ని రోజులుగా కళాశాలలో అధ్యాపకులు తమ ఫోన్లను తీసుకొని వాళ్ళ డేటా చెక్ చేస్తూ బయటకు చెప్పుకొని విధంగా మాట్లాడుతున్నారని విద్యార్థులు ఆరోపించారు. తమను ఇబ్బందులకు గురిచేస్తూ ఓవర్ డ్యూటీలు వేస్తూ సెలవు ఉన్నా సెలవులు ఇవ్వకుండా తమకు మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. అలాగే వాళ్ల చెప్పినట్టు వినకపోతే కళాశాల నుంచి పంపిస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారని విద్యార్థులు కన్నీరు పెడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఇబ్బందులు గురిచేసిన అధ్యాపకులను తొలగించి వేరే అధ్యాపకులను నియమించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు తాము ఆందోళన విరమించమని కళాశాల ముందు ఆందోళన చేశారు. సాయంత్రం 6:00 కి కళాశాల యజమాన్యం మీకు అన్ని విధాలుగా స్వేచ్ఛ ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.



విద్యుత్ షాక్‌తో యువ కౌలు రైతు మృతి

నవ తెలంగాణ - నర్సాపూర్



విద్యుత్తు షాక్‌తో యువ కౌలు రైతు మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. నర్సాపూర్ ఎస్సై పుష్పరాజ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యువ కౌలు రైతు గుండం మల్లేష్ (38) కౌలు తీసుకున్న పొలం వద్ద స్తంభం నుండి స్టార్టర్ డబ్బా కు ఉన్న తీగకు మరమ్మతులు చేస్తుండగా కరెంట్ షాక్ కు గురై మృతి చెందాడు. మల్లేష్ కుఉన్న 10 గుంటల భూమితో పాటు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలాన్ని కౌలుకు చేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. మృతునికి భార్య జ్యోతి, ముగ్గురు ఆడపిల్లలు అక్షయ 16. అక్షిత 14. అరుణ 12 లు ఉన్నారు. మల్లేష్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. మల్లేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివ కుమార్, ఎంపీటీసీ గుర్రాల లక్ష్మీ అశోక్, మాజీ సర్పంచ్ విజయ భాస్కర్ రాజు ఇతర గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.



నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలి

- రీ ఎగ్జామ్ నిర్వహించాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన



నవతెలంగాణ-చేర్యాల

నీట్ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆముదాల రంజిత్ రెడ్డి, దాసరి ప్రశాంత్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవకతవకలపై సమగ్ర విచారణతోపాటు రీ ఎగ్జామ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్ ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం చేర్యాల మండల కేంద్రంలోని పాత బస్‌స్టాండ్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి, ప్రశాంత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీట్ విద్యార్థులను రోడ్డుపై నెట్టేసిందని విమర్శించారు. ఎలాంటి సమాచారం లేకుండా ముందస్తుగా ఫలితాలు వెల్లడించడంపై దేశ వ్యాప్తంగా అనేక ఫిర్యాదులు, ప్రధానంగా ఎన్.టి.ఎను తీసుకుని వచ్చిన నాటి నుంచి దాని పారదర్శకతపై అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. పేపర్ లీకేజీ చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీపైన ప్రధాన మంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి సుద్దాల భాస్కర్, డివిజన్ నాయకులు తాడూరి భరత్, మధు,అజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ వారిని పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



నవ తెలంగాణ-మెదక్ టౌన్

మెదక్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకువడం బాధాకరమని బీఆర్ఎస్ నాయకులు కంఠ రెడ్డి తిరుపతి రెడ్డి, మామిళ్ల ఆంజనేయులు, మధుసూదన్ రావు మాణిక్ రెడ్డి ఆవేదన చెందారు. అల్లరి మూకల చేతిలో గాయపడి హైదరాబాద్ లోని ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 సంవత్సరాల తర్వాత ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని అన్నారు. అందరం సమన్వయం పాటించాలని ఘర్షణల వల్లన యువకులు బలి కావద్దని వారన్నారు. పోలీసు శాఖ అనుమానిత వ్యక్తిలను వదిలిపెట్టవద్దని కోరారు. 10 సంవత్సరాల బి ఆర్ ఎస్ పాలనలో ఇలాంటి సంఘటనలు ఎక్కడ జరగలేవన్నారు. కొందరి స్వార్థం కోసం రెచ్చగొట్టే ప్రసంగాలకు యువకులు బలి కావద్దని యువకులను కోరారు. మెదక్ పట్టణంలో అన్ని వర్గాల ప్రజలు సోదర భావంతో కొనసాగలని వారు సూచించారు.

నీట్ పరీక్ష పేపర్ లీక్ వల్ల 24 లక్షల విద్యార్థులకు నష్టం

నవతెలంగాణ-సిద్దిపేట

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వాకం వల్ల దేశ వ్యాప్తంగా ఇరవై నాలుగు లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష పేపర్ లీకేజి వల్ల నష్ట పోయారని ఎస్ఎఫ్ఐ, పీ.డీ.ఎస్.యు, ఎన్.ఎస్.యు ఐ, యూత్ కాంగ్రెస్ సంఘాల నాయకులు సంజీవ్, శ్రీకాంత్, అజ్మత్, వహాబ్‌లు అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజిపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత జరిగినా దేశ ప్రధాని మోడీ నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టిఏను రద్దు చేసి నీట్ పరీక్షను మళ్ళీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ఫలితాలను రద్దుచేసి పరీక్ష నిర్వహణను రాష్ట్రాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజ్ విషయంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, బాధ్యులను చట్టప్రకారం శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఎంపీల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యు.ఐ జిల్లా కార్యదర్శి భాను, ఉపాధ్యక్షుడు అజ్మత్ అలి, ఎస్.ఎఫ్.ఐ, పీడీఎస్.యు నాయకులు ర్యాషద్, రవి, నిశాంత్ గౌడ్, ప్రతాప్, వంశి, సాయి, రాజా, క్రాంతి, రాజా బాబు, లక్ష్మణ్, జవిద్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



ఎవరిని కాపాడడం కోసం కుట్రలు కుతంత్రాలు

విధి నిర్వాహణలో నిర్లక్ష్యం వహించిన పోలీసులను సస్పెండ్ చేయాలి
హిందూ ముస్లింలకు వేరువేరు న్యాయమా..!
మీడియా సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు

నవ తెలంగాణ మెదక్ టౌన్

ఎవరిని కాపాడానికి కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. హిందువులకు ముస్లింలకు వేరు వేరు న్యాయం అన్నట్లుగా పోలీసులు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. నిర్లక్ష్యం వహించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అల్లర్లలో అరెస్ట్ అయిన బీజేపీ కార్యకర్తలను సబ్ జైలులో పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంఘటన పట్ల పోలీసులను అప్రమత్తం చేసిన పోలీసులు పట్టించుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఎవరి మెప్పుల కోసం పోస్టింగ్‌ల కోసం, ఎవరిని కాపాడుకోవడం కోసం ఇలాంటి కుట్రలు చేస్తే సహించేది లేదని మండిపడ్డారు. స్థానికంగా ఉన్న మహిళా ఏఎస్ఐను బూతులు తిడితే కేసు నమోదు చేయని దుస్థితిలో పోలీసు యంత్రాంగం ఉందన్నారు. పోలీస్ స్టేషన్ లో పెట్టడం కాదని ఏఎస్ఐని బూతులు తిట్టిన వారిని పట్టుకొస్తే మీ యూనిఫామ్‌కు విలువ ఉంటుందన్నారు. పోలీసు అధికారులు డ్యూటీ చేస్తే సరిగా చేయండి చేతకాకపోతే సెలవు తీసుకుని వెళ్లాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తిని ఎవరు మెప్పుకోసం ప్రైవేట్ ఆస్పత్రిలో ఉంచుతున్నారని ఆయన అన్నారు. ఉర్దూ లో ఫిర్యాదు చేస్తే దాన్ని తెలుగులో కానిస్టేబుల్ తర్జుమా చేస్తారా అని ప్రశ్నించారు. మెదక్‌లో ఉన్న టౌన్, రూరల్ సిఐలకు మీ వీడియోల సిసి పుటేజిలను జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు అందజేసి న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీని కోరతానన్నారు. ఐజి రంగనాథ్ కరీంనగర్, వరంగల్‌లో ఎక్కువ ఉత్సాహం చూపించి బిజెపి చేతిలో భంగపడ్డారని గుర్తు చేశారు. పోలీసులకు చేతకాకపోతే యూనిఫామ్ వేసుకోవడం బంద్ చేయాలన్నారు. మీడియా సమావేశం అనంతరం ఎంపీ ఎస్పీ కార్యానికి వెళ్లి బాలస్వామితో అక్రమ అరెస్టులపై ఫిర్యాదు చేశారు.. మైనర్లను అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌లో కూర్చోబెడుతున్నారని బాధితుల తల్లిదండ్రులు ఎంపి దృష్టికి తెచ్చారు. అక్కడే ఉన్న డిఎస్పిని విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.



గ్రామాలకు బస్సు సర్వీసుల సౌకర్యం

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని వివిధ గ్రామాలకు పలు బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్టు జిన్నారం ఎంపీపీ దమ్మగౌని రవీందర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిన్నారం పటాన్చెరు- నర్సాపూర్ నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మండల పరిధిలోని మంగపేట, జిన్నారం సోలక్‌పల్లి, శివానగర్ తదితర గ్రామాలతో పాటు ఇతర గ్రామాలకు సౌకర్యవంతంగా బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. నూతన బస్సు రాక పట్ల ఆయా గ్రామాల ప్రజలు సంతోషంతో ఎంపీపీ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిన్నారం మండలం పరిషత్ ఉపాధ్యక్షులు గంగు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, వడ్డే కృష్ణ యూత్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు యాన గండ్ల సరేందర్, ఊట్ల మాజీ ఉపసర్పంచ్ జింకల రవి, జిన్నారం మాజీ ఎంపిటిసి పుట్టి భాస్కర్,గణేష్, పల్నాటి భాస్కర్ జింకల మధు, నర్సింగరావు, యాదగిరి, వినోద్, బాల్ రెడ్డి, అశోక్ యాదవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఝరాసంగం

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని గుంతమర్పల్లి గ్రామ శివారులో మంగళవారం జరిగింది. ఏఎస్ఐ గంగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన దశరథ్ రెడ్డి(45) ఫైల్స్ (అర్శమొలలు)తో గత కొన్ని నెలల నుంచి భాధపడుతున్నాడు. అది ఎంతకీ తగ్గపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై.. ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటిచ్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే అతడు ఈనెల 17వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి.. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, చుట్టుపక్కల వెతికారు. కానీ ఆచూకీ లభించలేదు. మృతుడికి ప్రతిరోజు గుంతమర్పల్లి గ్రామ శివారులోని రామమందిరానికి వెళ్లే అలవాటు ఉంది. మంగళవారం ఉదయం అక్కడికి వెళ్లి చూడగా శవమై కనిపించాడు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకొని మృతికి సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ఫర్టిలైజర్ దుకాణాల్లో ఏడీఏ తనిఖీలు

నవతెలంగాణ-కంగ్టి



మండలకేంద్రమైన కంగ్టిలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఏడీఏ నూతన్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రైతులను మోసం చేయకుండా నాణ్యమైన ఎరువులను, విత్తనాలను విక్రయించాలని.. వారికి ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలని దుకాణ యజమానులకు సూచించారు. సరిహద్దు ప్రాంతం కావడంతో ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే విత్తనాలను విక్రయించొద్దని.. రైతులు వాటిని కొనవద్దని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ, ప్రవీన్ చారి ఉన్నారు.

పాఠశాల ఆవరణలో మొరం పోయించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పుల్కల్



పుల్కల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో చిన్నపాటి వర్షం పడితే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయితే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు జారీ చేయడంతో.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోయిని శ్రీనివాస్ చొరవ తీసుకుని ఈ పాఠశాల ఆవరణలో జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో మంగళవారం మొరం వేయించారు. దాంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించి అందుబాటులోకి తీసుకురాడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు విద్యార్థులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఈనెల 22 నుండి 25 వరకు పాలిటెక్నిక్ మొదటి విడత కౌన్సెలింగ్

నవతెలంగాణ-సంగారెడ్డి

పాలిసెట్-2023 అడ్మిషన్లకు మొదటి విడత కౌన్సిలింగ్ ఈ నెల 22వ తేదీని నుంచి ప్రారంభిస్తున్నట్లు సంగారెడ్డి పాలిటె క్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 20 నుంచి 24 వ తేదీ వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.



తొలగించిన ముసుగు..

నవతెలంగాణ-సంగారెడ్డి

'కోడ్ ముగిసినా.. తొలగించని ముసుగు' పేరిట నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సంగారెడ్డి పట్టణంలోని అస్త్రాబల్ ఎఫ్ఆర్ఎస్ ఫల పరిశోధన కేంద్రం గేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి ఉన్న ముసుగు మంగళవారం తొలగించారు.



కీర్తిశేషులు రామోజీరావుకు ఘన నివాళి

నవతెలంగాణ-గుమ్మడిదల

మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిన్నారం మండల జర్నలిస్ట్ సంఘం సభ్యులంతా కలిసి ఈనాడు సంస్థల యజమాని కీర్తిశే షులు రామోజీరావు చిత్రపటానికి మం గళవారం పూలమాలవేసి నివాళ్లర్పిం చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుద్ఘాతంతో గేదె మృత్యువాత

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని పెద్దమ్మ గుడి గ్రామానికి చెందిన ఎర్రంత గారి శ్రీనివాస్ యాదవ్‌కు చెందిన గేదే విద్యుద్ఘాతంతో మంగళవారం మృత్యు వాత పడింది. సోమవారం కురిసిన భా రీ వర్షాలకు విద్యుత్ వైర్లు తెగిపడగా.. ప్రమాదవశాత్తు తీగను తాకి గేదె మృత్యు వాత పడింది. ఈ గేదె విలువ రూ.1,35,000 ఉంటుందని రైతు శ్రీని వాస్ యాదవ్ వాపోయాడు. జీవనోపాధి కోసం ఇటీవలే సంగారెడ్డి అంగడిలో బర్లు తీసుకొస్తే ఇంతలోనే ప్రమాదంలో గేదె మృత్యువాత పడిందని బాధిత రైతు ఆవే దన వ్యక్తం చేశాడు. ప్రభుత్వమే తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



చెట్టుకు ఉరేసుకున్న వ్యక్తి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని అహ్మద్‌గర్‌కాలనీ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన ఓ చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించారు. జహీరాబాద్ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి మృతి చెందా డని సమాచారం రావడంతో.. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కాగా మృతుడు తన లుంగీతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తున్నదని పోలీసులు తెలిపారు. మృతుని వయస్సు 45 నుంచి 50 ఏండ్ల మధ్య ఉంటుందన్నారు. మృతుడు నల్లని డ్రాయర్, తెల్ల గీతల లుంగీ, టవల్ కలిగి ఉన్నాడన్నారు. కనీసం వారం రోజుల క్రితమే అతడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలో భద్రపరిచామని.. ఎవరైనా ఆచూకీ తెలుసుకుంటే తక్షణమే జహీరాబాద్ పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



మల్లికార్జున ఆలయంలో చోరీ

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల కేంద్రంలోని మల్లికార్జున ఆలయంలో దొంగతనం జరిగినట్టు హద్నూర్ ఎస్సై రాము నాయుడు తెలిపారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తుడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

నీట్ పేపర్ లీకేజ్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- ఎన్‌టీఏ పరీక్షను రద్దు చేయాలి
- ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసనలు

నవతెలంగాణ-సంగారెడ్డి, జోగిపేట

నీట్ పరీక్ష పేపర్స్‌ను లీకేజ్ చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీ.రాజేష్, జోగిపేటలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష లీకేజీ పై కేంద్రం స్పందించకుండా, ఎవరైతే గ్రేస్ మార్కులు పొందారో వారి స్కోర్ కార్డులు రద్దు చేసి, వారికి మళ్లీ రీఎగ్జామ్ నిర్వహించడం అంటే నీట్ అవకతవకలు పక్కదారి పట్టించడమే అన్నారు. దాని వల్ల నీట్ ర్యాంకులు తారుమారు అయి గందరగోళం ఏర్పడుతుందన్నారు. నీట్ పరీక్షపై ప్రజలకు అనేక అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయకుండా ఎన్టీఏ ఏకపక్షంగా వ్యవహరిస్తుందన్నారు. పరీక్ష కంటే ముందురోజు బీహార్ రాష్ట్రంలో పాట్నాలో 13 మందిని పేపర్ లీకేజీ విషయంలో అరెస్టు చేశారని, హర్యానాలో కూడా ఒకే సీరియల్ నెంబర్ కల్గిన 8 మంది విద్యార్థులకు టాప్ ర్యాంకులు వచ్చాయని, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోనూ ఇలాంటి లీకేజీ అంశాలు ముందుకొచ్చాయన్నారు. వాటిపై విచారణ జరపకుండా కేవలం గ్రేస్ మార్కులు మాత్రమే రద్దు చేసి రీ ఎగ్జామ్ పెట్టడం అంటే నీట్ అవకతవకలు ప్రక్కన పెట్టి విస్మరించడం అవుతుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రలలో మాత్రమే నీట్ ర్యాంకులు, పేపర్ లీకేజీ ఆరోపణలు ఉన్నాయని వాటిపై తక్షణమే సుప్రీంకోర్టు నేతృత్వంలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రీ ఎగ్జామ్ నిర్వహించి, ఎన్టీఏను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న ఎన్టీఏ చైర్మెన్, డైరెక్టర్లను తప్పించాలని వారిపై సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ వాణి, జిల్లా కమిటీ సభ్యులు రవి నాయకులు కిరణ్, సాయి, మనోజ్, మల్లేష్, జోగిపేటలో ఎస్ఎఫ్ఐ నాయకులు, లింగరాజు, హరి ప్రభా, విజయ్, సుమంత్, చరణ్, వైష్ణవి, హారిక, ప్రవళిక, గాయత్రి ,పూజ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలోని స్థానిక ఐబీ వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలోనూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం. సురేష్ మాట్లాడుతూ.. దేశ చరిత్రలో 67 మందికి ఒకే ర్యాంక్ రావటం, పరీక్ష ఫలితాలు జూన్ 14న ప్రకటించాల్సి ఉన్నప్పటికీ.. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజునే ప్రకటించడం అనుమానాలకు బలమిస్తున్నదన్నారు. ప్రభుత్వం వెంటనే నీట్ పరీక్షా నిర్వహణ, ఫలితాల విడుదలపై లోతైన విచారణ జరిపి వాస్తవాలు బయటకు తీయాలన్నారు. వైద్య విద్యా ఎంపిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకే ఉండాలని.. అప్పుడే పకడ్బందీగా పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. వెంటనే ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు సందీప్ జిల్లా నాయకులు అర్జున్, శివ, సిద్ధార్థ్, సామి, ఆకాష్, రాజు ,తదితరులు పాల్గొన్నారు.







న్యాయ విచారణ జరపాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి



జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్)లో జరిగిన అవకత వకలపై న్యాయ విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి. జయరాజ్ డిమాండ్ చేశారు. నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మోడీ నాయకత్వంలోని బీజేపీ/ఎన్డీయే పాలనలో ఉన్నత చదు వుల కోసం నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల్లో అవకతవకలు, లీకే జీలు సర్వసాధారణంగా మారాయని విమర్శించారు. విద్యా ర్థుల జీవితాలు గందరగోళమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ సంబంధించి బీహార్, గుజరాత్లలో ప్రశ్నా పత్రాలు లీక్ చేశారనీ, పెద్దఎత్తున అవకతవకలు జరిగా యని తెలిపారు. ఈ పరీక్షలు రాసిన 24 లక్షల మంది విద్యార్థులు,వారి కుటుంబాలు తీవ్ర అందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షలు రాశారని వివరించారు. న్యాయ విచారణకు ఆదేశించాలనీ కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

త్వరగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ-రామచంద్రాపురం



నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సంభందిత అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఎస్సీ కాలనీల్లో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల ఆవరణలో నిర్మిస్తున్న నూతన భవనాల పనుల పురోగతిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనులు నత్త నడకన సాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే రెండు నెలల్లోగా పనులు పూర్తి చేసి.. ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. నూతన భవనాలు పూర్తయితే విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన భవనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నగేష్, మండల విద్యాధికారి రాథోడ్, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ..

- ఆదేశాలిచ్చిన జిల్లా విద్యాధికారి
- హర్షం వ్యక్తం చేసిన సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్

నవతెలంగాణ-సంగారెడ్డి



2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రయివేటు స్కూళ్లల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలని జిల్లా విద్యాధికారి అధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు సంగారెడ్డి జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరుతూ సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. డీఈఓ ఆదేశాలు జారీ చేయడంతో సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఎస్.డబ్ల్యుజెఎ) అధ్యక్షులు ఎం.సాయినాథ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యక్షులు ఎర్ర వీరేందర్ గౌడ్, సలహాదారులు సునీల్, వసంత్ కుమార్, ట్రెజరర్ నాగభూషణం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు సాయినాథ్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులో విద్యాధికారి ఇచ్చిన సర్కులర్‌తో పాటు అక్రిడేషన్ కార్డు జతపరిచి పిల్లలు చదువుతున్న స్కూల్లో సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులు ఉపయోగించుకోవాలని కోరారు.

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

- అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



నవతెలంగాణ-అమీన్‌పూర్

సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులని, విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ తప్పనిసరని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఓరుగంటి సమ్మిరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మెన్ టీపీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవి విరమణ కేవలం ఉద్యోగానికి మాత్రమేనని, ఇక నుండి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి రాథోడ్, కౌన్సిలర్లు కృష్ణ, చంద్రకళ గోపాల్, కల్పన ఉపేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తలారి రాములు, సీనియర్ నాయకులు తలారి యాదగిరి, చౌటకూరి మైపాల్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అంజిరెడ్డి జన్మదిన వేడుకలు

- బొల్లారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



ప్రముఖ పారిశ్రామికవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకుడు అంజిరెడ్డి జన్మదిన వేడుకలను బీజేపీ టౌన్ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బొల్లారంలోని మున్సిపల్‌లో పని చేస్తున్న 62 మంది పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర నాయకులు అంజిరెడ్డి వందేండ్లు చల్లగా ఉండాలని, మరెన్నో అత్యున్నతమైన పదవులు చేప ట్టాలని మనసారా కోరుకుంటున్నట్టు చెప్పారు. అలాగే ఎండ నక, వాననక, అహర్నిశలు శ్రమించి కష్టపడుతున్న మున్సి పల్ కార్మికులకు చీరలు పంపిణీ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో అఖిల్, మోహిత్ తదితరులు పాల్గొన్నారు.

సింగూరు కుడి కాలువ పనులు ప్రారంభించాలి

- మండల ప్రజలకు తాగు, సాగుకు నీళ్లివ్వాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు

నవతెలంగాణ-సదాశివపేట



సింగూరు కుడి కాలువ పనులు వెంటనే పూర్తి చేసి సదాశివపేట మండల ప్రజలకు తాగు, సాగుకు నీళ్ల ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సదాశివపేట మండలానికి పక్కనే సింగూరు ఉన్నప్పటికీ.. తాగు, సాగుకు నోచుకోలేదని విమర్శించారు. సింగూరు ప్రాజెక్టు కుడి కాలువకు నిధులు వస్తున్నా.. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు పూర్తి కావటం లేదన్నారు. కాబట్టి నిర్లక్ష్యంగా ఉన్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో నీళ్ల లేక రైతులు పత్తి పంట వేసి పెద్ద ఎత్తున నష్ట పోతున్నారన్నారు. తక్షణమే కాలువలు పూర్తి చేసి నీళ్ల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ప్రవీణ, నాయకులు భూషణం తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ కోసం ఉచిత లాంగ్ టర్మ్ శిక్షణ

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్-2025 (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్షకు ఉచిత లాంగ్‌టర్మ్ శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు డిగ్రీ అర్హత కలిగిన సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు బీసీ స్టడీసర్కిల్ వెబ్‌సైట్ www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా నేటి నుంచి వచ్చే నెల మూడు తారీఖులోగా దరఖాస్తు చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి. ప్రవీణ్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలు మించొద్దన్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి 100 మంది ప్రతిభావంతులను ఎంపిక చేయడం కోసం వచ్చే నెల 7న పరీక్ష నిర్వహిస్తామన్నారు. శిక్షణ తరగతులు 18-07-2024 నుంచి 18-04-2025 వరకు బిసి స్టడీ సర్కిల్, లక్ష్మీనగరాకాలనీ, సైదాబాద్, హైదరాబాద్‌లో జరుగాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రతి నెల లాడ్జింగ్ రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ.5000 అలాగే బుక్ ఫండ్ నిమిత్తం రూ.5000 ఒక్కసారి మాత్రమే ఇవ్వబడుతాయన్నారు. మరిన్ని వివరాలకు 08455-277015, 9949592991 నెంబర్లను లేదా బిసి స్టడీసర్కిల్, వెలుగు ఆఫీస్ క్యాంపస్, బైపాస్ రోడ్, సంగారెడ్డిలో ఆఫీస్ వేళలలో నేరుగా సంప్రదించాలన్నారు.

ఘనంగా కౌన్సిలర్ శంకర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట మున్సిపల్ ఒకటో వార్డు కౌన్సిలర్, జోగిపేట ముదిరాజ్ సంఘం యువజన అధ్యక్షులు డాకూరి శివశంకర్ జన్మదిన వేడుకలను మంగళవారం జోగిపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు కేక్‌కట్ చేయించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక శ్రీరామ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన జన్మదిన కార్యక్రమంలో కేక్ కట్ చేయించి ఆయనకు పలువురు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య వైస్ చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు ఎస్. సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, రంగ సురేష్, హరికృష్ణ గౌడ్, కోరబోయిన నాగరాజు, దుర్గేష్, చందర్ నాయక్, కోఆప్షన్ సభ్యులు అల్లే శ్రీకాంత్, మాజీ ఎంపిటిసి డాకూరి వెంకటేశం, మాజీ వార్డ్ నెంబర్లు పట్లోళ్ల ప్రవీణ్, చింతకుంట శివ, కాంగ్రెస్ నాయకులు డాకూరి శ్రీనివాస్, లక్ష్మణ్, చిట్యాల మధు, రాజశేఖర్, ఉలవల సతీష్, భాస్కర్, రామకృష్ణ, శరత్ బాబు, రవి, మాణిక్యం, చోటు, అబ్బాస్ అలీ, రాము తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ నిధి విడుదల పట్ల కృతజ్ఞతలు

నవతెలంగాణ-జహీరాబాద్

17వ విడత పీఎం కిసాన్ సన్మాన్ నిధి విడుదల చేయడం పట్ల ప్రధానమంత్రికి జహీరాబాద్ అసెంబ్లీ రైతుల తరపున బీజేపీ జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నౌభాద్ జగన్నాథం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17వ విడత పీఎం కిసాన్ సాయం ద్వారా దేశవ్యాప్తంగా 9.26 కోట్ల మందికి లబ్ధి కలుగుతుందన్నారు. రూ.20 వేల కోట్లను రైతులకు సాయంగా కేంద్రం అందించిందన్నారు. ప్రధానమంత్రి రైతులకు ఎన్నో రకాలుగా సాయం చేస్తూ.. వారి పక్షాన వారు నిలబడ్డారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడిచినా.. సమయానికి రైతుబంధును వేయడం లేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
మెదక్
బుధవారం | 19 జూన్ 2024 | www.navatelangana.com

ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరిన యువకులు



నవతెలంగాణ-మనోహరాబాద్

కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో ప్రజలు మూడోసారి బీజేపీకి పట్టం కట్టారని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు పేర్కొన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది యువకులు సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్, భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా కార్యదర్శి భాషాబోయిన చంద్ర శేఖర్‌ల ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు సంక్షేమంగా పని చేస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే దేశంలోని రైతుల కోసం పీఎం కిసాన్ యోజన కింద రూ.20 వేల కోట్లను పంపిణీ చేసిన ఘనత బీజేపీ పార్టీదేనన్నారు. ఈ కార్యక్రమంలో కుచారం మాజీ సర్పంచ్ జక్కిడి నరేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నరేందర్ చారి, జిల్లా నాయకులు ఎల్.ప్రభాకర్ గౌడ్, కుమ్మరి, నాగరాజ్, కె.కృష్ణ. కొత్తూరి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొల్చారంకు మంత్రుల రాక



నవతెలంగాణ- కొల్చారం

మండల కేంద్రం కొల్చారంలోని నూతనంగా నిర్మించిన మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించేందుకు జిల్లా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డిలు హాజరవుతున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ మంగళవారం తెలిపారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యుత్ ఘాతానికి గురై వ్యక్తి మృతి



- విలపిస్తున్న కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-వెల్దుర్తి

విద్యుత్ ఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండల పరిధి బండ పోసానిపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. బండ పోసాని పల్లి గ్రామానికి చెందిన గుండు ప్రభాకర్ 40 సంవత్సరాలు వ్యవసాయ బోరు మోటర్ బోర్‌లో దింపి స్టార్టర్ బాక్స్ మరమ్మతులు చేసి కరెంటు సరఫరా కాకపోవడంతో పక్కనే ఉన్న కరెంటు స్తంభంపై ఉన్న ఎల్‌టిలైన్ సరి చేస్తున్న క్రమంలో అదే వరుసలో 11 కె.వి వైర్ అకస్మాత్తుగా తెగి ప్రభాకర్‌పై పడటంతో విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు భార్య శ్యామల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని వెల్దుర్తి ఎస్ఐ నవత గౌడ్ తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్లు తెలిపారు. మృతునికి తల్లి పోచమ్మ ఓ కుమారుడు కూతురు ఉన్నట్లు తెలిపారు. ఉదయం వరకు కండ్ల ముందే తిరిగిన వ్యక్తి అకస్మాత్తుగా మరణించడంతో బండ పోసానిపల్లి గ్రామంలో విషాద ఛాయలు చోటుచేసుకున్నాయి. విద్యుత్ అధికారులకు ఎల్ టి లైన్ పైనున్న 11 కె.వి వైర్లను పక్కకు జరపాలని పలుమార్లు గ్రామస్తులు రైతులు విన్నవించిన పట్టించుకోలేదని అన్నారు. విద్యుత్ షాక్కు కారణమైన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకొని మరణించిన వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పీఎం కిసాన్ ప్రోగ్రామ్ లైవ్ టెలికాస్టింగ్



నవతెలంగాణ-కౌడిపల్లి

కృషి విజ్ఞాన కేంద్రం తునికి పీఎం కిస్సాన్ సమ్మాన్ నిధి యొక్క 17 విడతల విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని సోమవారం చేశారు. ఈ సమావేశంలో డా.నల్కర్ సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కెవికె శాస్త్రవేత్త కెవికెలో అందుబాటులో ఉన్న వివిధ ఉత్పత్తులు సేవల గురించి వివరించారు. సహజ వ్యవసాయం, కిస్సాన్ శరత్ పోర్టల్, అగ్రికల్చర్ డ్రోన్, బయోఫెర్టిలైజర్లు, సేంద్రీయ కూరగాయల ఉత్పత్తి, కస్టమ్ నియామక కేంద్రం, కెవికె ద్వారా స్థాపించబడిన రైతు ఉత్పత్తి సంస్థలు గురించి కూడా వివరించారు. మెదక్ జిల్లా రైతులు, రామానాయుడు కళాశాల విద్యార్థులు కేవీకే శాస్త్రవేత్తలు శ్రీకాంత్, రవి కుమార్, ఉదయ్ కుమార్, శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, భార్గవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-పెద్దశంకరంపేట

మండలంలోని బూర్గుపల్లి, రామోజీపల్లి 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల్లో నిర్వహణ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ శ్రీకాంత్ తెలిపారు. ఈ ఫీడర్ల పరిధిలోని కొత్తపేట, వీరోజీపల్లి, సంగారెడ్డి, జూకల్, మూసాపేట, దారంపల్లి, శివాయపల్లి, మాడ్చుట్పల్లి గ్రామాలతో పాటు పరిసర తండాలకు బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గ్రామపంచాయతీ ఆదాయానికి గండి

- ఎలాంటి పర్మిషన్లు లేకుండానే భవనాల నిర్మాణాలు





నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో అనేక బిల్డింగులు ఎలాంటి పర్మిషన్లు లేకుండానే నిర్మిస్తున్నారు. గ్రామ పంచాయతీకి రావలసిన పర్మిషన్ రుసుము చెల్లించకుండానే భవనాలు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మండల కేంద్రంలో ఎన్నో భవనాలు నిర్మిస్తున్న అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రంలో వాడ వాడలా విద్యుత్తు బల్బులు వేయాలని డ్రైనేజీలు నిర్మించాలని గ్రామపంచాయతీ అధికారులకు గ్రామస్తులు మొరపెట్టుకుంటుంటే గ్రామపంచాయతీలో ఎలాంటి నిధులు లేవని గ్రామ కార్యదర్శి నర్సింలు చెప్తుంటారు. మండల కేంద్రంలో భవనాలకు పర్మిషన్లు ఇచ్చినట్లయితే నిధులు సమకూర్చుకోవచ్చు కానీ భవనాల యజమానులు ఎలాంటి పర్మిషన్లు లేకుండానే బిల్డింగులు నిర్మిస్తున్నారు. గ్రామపంచాయతీ ఆదాయానికి రావలసిన నిధులు రావడంలేదని గ్రామస్తులు పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా నాలా పర్మిషన్లు లేకుండానే కొందరు బిల్డింగులు నిర్మిస్తున్న మాట వాస్తవమేనని వారికి నోటీసులు కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి వెంటనే అక్రమ నిర్మాణాలపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దు

- మెదక్ ఎస్పి బాలస్వామి



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ పట్టణంలో ఇరు వర్గాల్లో జరిగిన గొడవలు అదుపులోకి వచ్చాయని గొడవలకు కారణమైన ఒక వర్గానికి చెందిన 16 మందిని మరో వర్గానికి చెందిన 11 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించామని ఎస్పి బాలస్వామి అన్నారు. రెండు వర్గాల మధ్య జరిగిన గొడవల కారణాంగా ఇతర జిల్లాల నుంచి పోలీస్ ఫోర్స్ తెప్పించి అంతా అదుపులోకి తెచ్చినట్టు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా వాట్సాప్, ట్విట్టర్, ఫేస్ బుక్ మొదలైన వాటి ద్వారా వచ్చే ఎలాంటి వదంతులను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఎవరైనా ఉద్దేశ్యపూరకంగా సోషల్ మీడియాలో కానీ మరే ఇతర రకంగా గొడవలు పెట్టాలనుకుంటే వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని సోషల్ మీడియాపై నిఘా పెట్టామని, గొడవలకు కారణమైన ఎవరిని వదలమని హెచ్చరించారు. సోషల్ మీడియాలో విద్వేషకర, రెచ్చగొట్టే, తప్పుడు పోస్టులు పెట్టవద్దని అలా కాదని ఎవరైనా తప్పుడు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిని జిల్లా పోలీసులు నిరంతరం గమనిస్తారని, అలాంటి వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.

సాగుకు.. సమాయత్తం

- పత్తి పంట పైనే రైతుల మొగ్గు చూపు

తొలకరి చినుకులతో ప్రారంభమైన వ్యవసాయ పనులు

- ముమ్మరంగా విత్తనాలు నాటుతున్న రైతులు
- త్వరితగతిన రుణమాఫీ చేయాలని రైతుల వేడుకోలు





నవతెలంగాణ-కొల్చారం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వర్షాలు కురవడంతో పంటల సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. కోటి ఆశలతో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతూ.. పొలాల్లో దుక్కులు దున్నుతున్నారు. ధరలకు అనుగుణంగా పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం పెంచాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల తొలకరి జల్లులు కురిసిన వర్షాలకు అన్నదాతలు విత్తన సేకరణ, దుక్కి దున్నకంలో నిమగ్నమయ్యారు. ఈసారి వర్షాలు దంచికొట్టే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.. కొల్చారం మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో భౌగోళిక విస్తీర్ణం 22496 ఎకరాలు ఉండగా ఇందులో వ్యవసాయ భూమి 12 వేల ఎకరాలు, సాగుకు వీలులేని భూమి 10496 ఎకరాలు ఉంది. ఇందులో భాగంగా సన్న, చిన్న కారు రైతులు 11057 మంది ఉన్నారు. గతేడాది వరి 18975 ఎకరాలు, పత్తి 1125 ఎకరాల మేరకు పంటలు సాగు చేసినట్లు అధికారులు నివేదికల ద్వారా తెలిపారు. ఈ ఏడాది అధికంగానే సాగు విస్తీర్ణం మరో 300 ఎకరాలు పెరిగే అవకాశం ఉందని మండల వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఈ మేరకు వానాకాలం ప్రణాళికలను వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. తొలకరి జల్లులు కురిసిన తరుణంలో వరి సాగు చేసే పొలాల్లో ఇప్పటికే రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగ విత్తనాలు రాయితీపై పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే మండలానికి 1600 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ప్రస్తుతం యూరియా 200, డిఏపి 150, కాంప్లెక్స్ 250, మెట్రిక్ టన్నుల ఎరువులు వివిధ ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పెట్టుబడులకు అగచాట్లు

అన్నదాతకు సాగు కష్టాలు మొదలయ్యాయి. చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితిలో సీఎం రేవంత్ రెడ్డి రైతు బరోసా పథకం ద్వారా ఎకరానికి రూ.7500 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. అయితే మొదటి విడతగా గత ప్రభుత్వం ప్రకారం ఎకరానికి రూ.5 వేల చొప్పున రైతుల ఖాతాలో జమ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం జమ చేస్తుందా.. లేదా అన్న సందేహాలు రైతుల్లో నెలకొన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడి సాయం సరిపోవక పోవడంతో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ధరలకు అనుగుణంగా సాయాన్ని పెంచితే బాగుంటుందని కొందరు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే బ్యాంకులు సైతం సాగు పెట్టుబడుల కోసం రుణాలు ఇవ్వకపోవడం పట్ల రైతులు నిరాశ చెందుతున్నారు. కొంతమంది రైతులు చివరికి చేసేదేమీ లేక ఇళ్లలో ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇంకొందరు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వాన దేవుడు కరుణించకపోతడా అన్న ఆశతో అప్పులు చేసి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బ్యాంకర్ల ద్వారా సకాలంలో రుణమాఫీ చేసి కొత్త రుణాలు ఇప్పించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

ఎరువుల ధరలు తగ్గించాలి

రైతు, యాదగిరి పైతర

కష్టపడి పంటలు పండిస్తే ఏమి మిగులుతలేదు. ఎరువుల ధరలు తగ్గించాలి. రెండు రోజుల క్రితం పడిన వర్షానికి దుక్కులు దున్నుతున్నం. పెద్ద వానలు పడంగనే పంటలు పెడుతాం. ఎరువుల కొరతలు లేకుండా చూడాలి.

సకాలంలో రుణమాఫీ చేయాలి



సకాలంలో రుణమాఫీ చేస్తే పంటల సాగు కోసం కొత్త రుణాలు తీసుకుంటాం. బయట వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చే బాద తప్పుతుంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

కిషన్, రైతు

ఇబ్బందులు లేకుండా చూస్తాం.



వానాకాలం పంటలకు సంబంధించి ఎరువుల కొరత లేకుండా చూస్తాం. ఇప్పటికే రైతులకు ఆయా సహకార సంఘాల్లో, ఫర్టిలైజర్ దుకాణాల్లో కొంతమేరకు ఎరువులను సిద్ధంగా ఉంచాం. అవసరమైన మేరకు జీలుగ, జనుము విత్తనాలను అందజేశాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వివిధ రకాల విత్తనాలు కూడా అందుబాటులో ఉంచాం.

స్వేతాకుమారి, మండల వ్యవసాయ అధికారి, కొల్చారం

ప్రజా అవసరాలను గుర్తించి పనులు చేపట్టాలి

- ఎంపీపీ గడ్డి స్వప్న వెంకటేష్ యాదవ్





నవతెలంగాణ-తూప్రాన్

ప్రజా అవసరాలను గుర్తించి పనులు చేపట్టాలని ఎంపీపీ గడ్డి స్వప్న వెంకటేష్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఎంపిపి గడ్డి స్వప్న వెంకటేశ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన తూప్రాన్ సర్వసభ్య సమావేశం మంగళ వారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిపి గడ్డి స్వప్న వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని గ్రామాలలోని ప్రజలకు అవసరమైన పనులను వెంటనే చేసి పెట్టాలని వివిధ శాఖల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు,ప్రత్యేక అధికారులకు సూచించారు. మండలంలోని గ్రామాలలో ఉన్న గుడిసెలకు, పెంకుటిల్లు, స్లాబ్ ఇండ్లకు నీటి కనెక్షన్ లేని వాటికి మిషన్ భగీరథ ద్వారా కొత్త కనెక్షన్ ఇవ్వాలని మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ నెల 20న ప్రభుత్వ పాఠశాలల్లో నులిపురుగుల మందులు ఇస్తామని, మిగిలిన వారికి 27న పంపిణీ చేస్తామన్నారు. వర్షాకాలం రావడంతో సీజినల్ వ్యాధులు రాకుండా ఇంటి చుట్టూ ప్రక్కల ఉన్న పరిసర ప్రాంతాలను చెత్త చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి జ్యోస్న తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో మెను ప్రకారంగా గర్భిణీలకు, బాలింతలకు గుడ్లు, పాలు, పోషక పదార్థాల సరుకులు, ఇస్తున్నామని, మండలంలో 4 అంగన్వాడీ కార్యకర్తలు,6 అయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంగన్వాడీ సూపర్వైజర్ ఇందిర తెలిపారు. యావపూర్ గ్రామానికి 8 విద్యుత్ స్తంభాలు కావాలని యావపూర్ ఎంపిటిసి గంగుమల్ల సంతోష్ రెడ్డి విద్యుత్ అధికారులను కోరడంతో వారు సానుకూలంగా స్పందించారు. వర్షాకాలంలో మండల పరిధిలోని గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలని విద్యుత్ అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్లు మహిళా సంఘాలకు చెందిన మహిళలు కుట్టిన వాటిని అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో వారికి ట్రైనింగ్ ఇస్తామని ఎపిఎం రుక్మిణీ చెప్పారు. అడవులలో మొక్కలు పెంచడానికి మేము సహకరిస్తామని అటవీ అధికారిణి మౌనిక తెలిపారు. గ్రామాలలో రైతులు పాంపడ్ తవ్వడానికి మంజూరు చేస్తామని, నర్సరీల ద్వారా పెంచిన మొక్కలను ప్రతి ఇంటికి పంచి పెట్టిస్తామని, మొక్కలను పెంచడంలో ప్రజలను భాగస్వాములను చేస్తామని ఏపీవో సంతోష్ రెడ్డి అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిధుల నుంచి తూప్రాన్ మండల పరిధిలో మొత్తం 13 పాఠశాలల గాను రూ.59.25 లక్షలు మంజూరైనాయి. వీటిలో నుండి త్రాగునీటి కోసం 12 పాఠశాలలకు గాను 12 లక్షలు, చిన్న చిన్న మరమ్మత్తుల కోసం రూ.29.34 లక్షలు, మరుగుదొడ్ల మరమ్మత్తుల కోసం 10.51 లక్షలు,విద్యుత్ మరమ్మత్తుల కోసం 13 పాఠశాలలకు 7.40 లక్షలు మంజూరై ప్రగతిలో ఉన్నావని విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండలంలో సాధారణ వర్షపాతం 43.9 ఎం ఎం నుంచి 97 ఎం ఎం శాతంతో పోలిస్తే ఇప్పుడు కురిసిన వర్షపాతం 158 ఎంఎం వర్షం కురిసిందనీ వ్యవసాయ అధికారి గంగమల్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు రైతుబంధు పథకం ద్వారా 11,314 మంది రైతులు 8,44,62,850 రూపాయలు పొందారు. రైతు బీమా పథకం ద్వారా 252 మంది రైతులకు రూ.12.60 కోట్లు ఇవ్వడం జరిగిందని ఏవో తెలిపారు. పిఎం కిసాన్ ద్వారా 5582 రైతులకు 1,11,64,000 రూపాయలు వారి అకౌంట్లో జమ చేశామన్నారు. మండల పరిధిలోని పశువులకు గుండె వాపు వ్యాధికి 1058, జబ్బ వాపు 180 వ్యాధి టీకాలు వేశామని పశు వైద్యాధికారి లక్ష్మీ తెలిపారు. మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో భర్త చనిపోయిన భార్యలకు పెన్షన్ లు రాకుండా ఉన్నవారికి,నెల రోజుల్లో వితంతువులకు పెన్షన్ మంజూరు చేసి ఇవ్వాలని వైస్ ఎంపీపీ శరణ్య సూచించారు. మండల సర్వ సభ్య సమావేశానికి 4 శాఖలు సంబంధించిన అధికారులు హాజరు కాలేదని, వారికి సంబంధించిన వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు రిపోర్టు పంపిస్తామని మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ గడ్డి స్వప్న వెంకటేశ్ యాదవ్, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శరణ్య, పి ఆర్ ఏ ఈ మధుసూదన్, వెటర్నరీ అధికారి లక్ష్మి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ దివ్య, అగ్రికల్చర్ ఏవో గంగమల్లు, ఏపీఎం రుక్మిణి, అటవీ అధికారి మౌనిక, ఏపీఓ సంతోష్ రెడ్డి, వైద్యాధికారి జ్యోస్న, సిహెచ్ఓ బాలనర్సయ్య, బాడీ సూపర్వైజర్ ఇందిర, సీనియర్ అసిస్టెంట్, విద్యా అధికారులు, ఎంపీటీసీలు గంగమల్ల సంతోష్ రెడ్డి, పంజాల వెంకటమ్మ, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు కల్పన, అరుణ, పుష్ప,జూనియర్ పంచాయతీ కార్యదర్శులు,ప్రత్యేక అధికారులు హాజరయ్యారు.

ఎమ్మెల్యేని విమర్శిస్తే ఊరుకునేది లేదు

- అమర సేనా రెడ్డి



నవతెలంగాణ-నిజాంపేట

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు రావిపల్లి అమర సేనా రెడ్డి అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రఘునందన్ రావు ఎంపీ అయిన తర్వాతనే అల్లర్లు చెల్లారేగుతున్నాయన్నారు. ప్రశాంతంగా ఉన్న మెదక్ జిల్లాను మత రాజకీయాలతో హిందూ ముస్లింలకు అల్లర్లు సృష్టిస్తున్నారన్నారు. హిందూ ముస్లిం అన్నదమ్ముల వలే కలిసున్నా మెదక్ ప్రజలను విడదీస్తున్నారన్నారు. మైనంపల్లి కుటుంబం మెదక్ నియోజకవర్గ ప్రజలకే కాకుండా తెలంగాణ ప్రజలకు అందరికీ అండగా ఉంటుందన్నారు. కొందరు బిజెపి నాయకులు మైనంపల్లి కుటుంబాన్ని రౌడీలని సంబోధించడం సబబు కాదని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల మన్ననలు పొందిన వారని. కరువు కాటకాలలో ప్రతి గ్రామంలో బోర్లను వేయించి మంచినీటిని ప్రజలకు తాగించిన వారన్నారు. బిజెపి నాయకులు ఇకనైనా జాగ్రత్తగా ఉండాలని లేనియెడల తగిన రీతిలో వారికి బుద్ధి చెప్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్దరాములు, పంజా మహేందర్, మారుతి, వై వెంకటేశం వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, లింగం గౌడ్, ఎండి నసిరుద్దీన్, సత్యనారాయణరెడ్డి, మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, ఆకుల బాలయ్య, సొమ్మ బాబు, నరేందర్,బొయిని చంద్రం, బాజె రమేష్, చిన్న అంజాగౌడ్, బుమగౌడ్, మహేష్, పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ, ఇరువురికి తీవ్ర గాయాలు





నవతెలంగాణ-టేక్మాల్: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన టేక్మాల్ మండల పరిధిలోని పల్వంచ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, కోరంపల్లి ఎంపీటీసీ నీరుడి హనుమంతు, పోరంపల్లి నుంచి టేక్మాల్ వైపు వస్తుండగా, అందోల్ మండలం ఠాకూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు టేక్మాల్ నుంచి దాకూర్ వైపు వెళుతూ ఎదురెదురుగా వెళుతూ బైకును బలంగా ఢీకొట్టారు. దీంతో బైక్ పై ప్రయాణిస్తున్న హనుమంతు తలకు తీవ్రమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. స్థానికులు 108 సాయంతో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు టేక్మాల్ ఎస్సై మురళి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్



నవతెలంగాణ-మనోహరాబాద్

పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీఓ సతీష్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా జీతాలు లేక కార్మికులు అవస్థలు పడుతున్నారని మేము ఎట్ల బతికేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాపై ప్రభుత్వం ఎందుకు కక్ష కట్టిందన్నారు. అందరి ఉద్యోగులకు ఇచ్చినట్టు మాకు కూడా నెల నెల ఇచ్చి ఆదుకోవాలని గ్రామాలలో పనిచేస్తున్న సఫాయి కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సూర్యుడు పొడవక ముందే ఇంటింటా తిరుగుతూ చెత్త బండి వచ్చిందమ్మా. తడి పొడి చెత్త వేరుచేసి ఇవ్వండమ్మా అంటూ గ్రామంలో తిరుగుతూ ఊరును శుభ్రం చేస్తున్న సఫాయి కార్మికుల బాధను అర్థం చేసుకోకపోతే ఇంకెవరు బాధలను అర్థం చేసుకుంటారని మండిపడ్డారు ఈ కార్యక్రమంలో స్వామి, అంజయ్య, బాలమణి, దేవమ్మ ఎల్లం మైసమ్మ, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి చల్లంగా చూడు ....!



ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలో రేణుకా ఎల్లమ్మ తల్లి అమ్మవారిని మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేటట్లు చల్లంగా చూడాలంటూ ఎల్లమ్మ తల్లిని మొక్కుకున్నారు. కుటుంబ సమేతంగా అమ్మవారికి పట్నం సమర్పించుకొని బోనం ఎత్తి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కేడం లింగమూర్తి, మండల అధ్యక్షుడు బంక చందు, చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



నవతెలంగాణ-గజ్వేల్

వంద సంవత్సరాలు పూర్తిచేసుకుని 107వ సంవత్సరంలోకి అడుగిడి మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే కుమారులు, కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్లు తదితర కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కలిసి ఇటీవలే గజ్వేల్ పట్టణానికి చెందిన శతాధిక వృద్ధురాలు మైస నర్సమ్మ 107వ జన్మదిన వేడుకలను ఎస్సీ కాలనీ తన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. 107వ జన్మదిన వేడుకలను చేసుకున్న కొద్దిరోజుల్లోనే మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో బాధపడుతూ అకాల మరణం చెందారు. మృతురాలి పెద్ద కుమారుడు మృతి చెందగా చంద్రయ్య, రాములు, స్వామి, కోడళ్ళు, మనవరాల మనవళ్ళు, మనవరాళ్ళు ఉన్నారు.

వారసంత ఆదాయం రూ.3.43 లక్షలు



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే కూరగాయలు, పశువుల వారసంత నిర్వహణకు వేలం ద్వార రూ.3.43 లక్షల ఆదాయం సమకూరినట్టు ఎంపీఓ విష్ణువర్ధన్ తెలిపారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేలంలో కూరగాయల సంత రూ.2.53 లక్షలు, పశువుల సంతకు రూ.90 వేలకు నిర్వాహకులు దక్కించుకున్నట్టు ఎంపీఓ తెలిపారు. పంచాయితీ కార్యదర్శి ప్రణీత్ రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది,పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్ శిక్షణ

నవ తెలంగాణ-సిద్దిపేట

పట్టణ, పరిసర ప్రాంత గ్రామీణ మహిళలందరికీ ప్రగతి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉచితంగా బ్యూటిషన్ కోర్స్ అందిస్తున్నట్లు ప్రగతి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వడ్డేపల్లి స్వరూప రాణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కేవలం 30 రోజుల్లోనే కోర్స్ పూర్తి చేసి, సర్టిఫికెట్‌ని అందిస్తామని, ఇంటి వద్దనే ఉంటూ నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయాన్ని సంపాదించుకోవడానికి ఇది చక్కని అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ జిరాక్స్, 2 ఫోటోలతో తమ కేంద్రానికి రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9885885262, 9491995033, 9392643373 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి



నవతెలంగాణ-మిరుదొడ్డి

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అతికం అంజా గౌడ్ (53) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ ఉండేవాడు. కుటుంబ యజమాని మృతి చెందడంతో కుటుంబీకులు అనాధలుగా మారారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. అనంతరం ఆటో కార్మికులు సంతాపం వ్యక్తం చేశారు.

22వ తేదీ నుంచి పాలిసెట్ కౌన్సిలింగ్

నవతెలంగాణ-నంగునూరు

పాలిసెట్-2024 అడ్మిషన్లకు మొదటి విడత కౌన్సిల్సింగ్ ఈ నెల 22వ తేదీని నుంచి ప్రారంభిస్తున్నట్లు రాజగోపాల్ పేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్య నారాయణ తెలిపారు. నంగునూరు మండలం రాజగోపాల్ పేట పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నేడు పంచాయితీ కార్మికుల మహాధర్నా

నవతెలంగాణ-బెజ్జంకి

గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న పంచాయితీ కార్మికుల వేతనాలను చెల్లించాలని డిమాండ్‌తో బుధవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద మహాధర్నా తలపెట్టామని పంచాయితీ కార్మికుల గౌరవ మండలాధ్యక్షుడు బోనగిరి లక్ష్మన్ మంగళవారం తెలిపారు. మండలంలోని అయా గ్రామాల పంచాయితీ కార్మికులు పెద్ద ఎత్తున హజరై జయప్రదం చేయాలని లక్ష్మన్ కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రూప రాజశేఖర్ రెడ్డి (దూత) పెళ్లిరోజు సందర్భంగా గవర్నమెంట్ హాస్పిటల్‌లో అన్నదానం నిర్వహించినట్లు వాసవి క్లబ్ అధ్యక్షులు చకిలం రవి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కుల మతాలకతీతంగా నిరుపేదలకు సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కోశాధికారి ఇల్లందుల నాగేందర్, పి ఆర్వో దుర్గయ్య, హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

20న తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక వేలం

నవతెలంగాణ-చేర్యాల

మండలంలో ఇటీవల అక్రమంగా 10 ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా రెవిన్యూ అధికారులు పట్టుకొని ఇసుకను తహసీల్దార్ కార్యాలయంలో నిల్వచేశారు. నిల్వ చేసిన ఇసుకను ఈ నెల 20వ తేదిన గురువారం ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన దినేష్



నవ తెలంగాణ-సిద్దిపేట

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్ కుమార్ ని బీజేవైఎం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ మంగళవారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. పూల బొకే అందించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దినేష్ మాట్లాడుతూ బండి సంజయ్‌కి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కడం పట్ల సంతోషంగా ఉందని అన్నారు.

పాండవుల చెరువును పరిశీలించిన కమిషనర్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో ఉన్న పాండవుల చెరువు, వైకుంఠ ధామాన్ని కమిషనర్ గోల్కొండ నరసయ్య పరిశీ లించారు. మంగళ వారం ఆయన మున్సిపల్ అధికారు లతో కలిసి క్షేత్రస్థాయి లో పరిశీ లించారు. పాండవుల చెరువు పరి శుభ్రతపై సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలోని 20 , 2వ వార్డులో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ గోపాల్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు

తక్కువ వ్యవధిలో ఎక్కువ ఉపాధి అవకాశాలు

- డిప్లమా పూర్తి ఇంజనీర్‌గా స్థిరపడవచ్చు
- 22 నుంచి పాలిసెట్ కౌన్సిలింగ్

నవతెలంగాణ-నంగునూరు

పదవ తరగతి తర్వాత విద్యార్థి వేసే ప్రతి అడుగు ఎంతో కీలకమైంది. విద్య ఉన్నతి పరంగా భవిష్యత్తుకు బాటలు వేసేందుకు సరైన నిర్ణయాలు తీసుకునే దశ ఇదే. ఈ క్రమంలో తక్కువ వ్యవధిలో ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా కల్పించే పాలిటెక్నిక్ కోర్సులకు ఆదరణ పెరుగుతుందని ఆ రంగం నిపుణులు పేర్కొంటున్నారు. తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్న సాంకేతిక విద్యా కోర్సు ఇది. ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందే అవకాశం ఉంది. డిప్లొమా కోర్సులు పూర్తిచేసి ఇంజనీర్‌గా స్థిరపడవచ్చు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మే 24న నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష 6668 మంది విద్యార్థులు రాశారు. ఇటీవల ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, వికారాబాద్ జిల్లాలలో 2020 సీట్లు అందుబాటులో ఇటీవల ఫలితాలు వెలువడడంతో ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు ఈనెల 20 నుంచి కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టడంపై వివరాలు ఇలా ఉన్నాయి. నాలుగు జిల్లాలలో అందుబాటులో ఉన్న డిప్లొమా కోర్సులు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు వికారాబాద్‌తో 14 పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

పాలిటెక్నిక్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

సూర్యనారాయణ, రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్

సాంకేతిక విద్యకు ప్రస్తుతం మంచి ఆదరణ ఉంది. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు. ప్రైవేటు రంగంలో మరెన్నో కొలువులు అందుబాటులో ఉన్నాయి. ఐటి, యంత్ర విద్యలు చదివేందుకు సులువైన మార్గంగా ఉంది. చాలా కంపెనీలు టెక్నికల్ అర్హత ఉన్నవారికి అవకాశాలు కల్పిస్తున్నాయి.

కౌన్సెలింగ్ ప్రక్రియ ఇలా..

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 20 నుంచి 24 వరకు అంతర్జాలంలో ప్రాథమిక సమాచారాన్ని సమర్పించి స్లాట్ నమోదు చేసుకోవాలి. ఈ నెల 22 నుంచి 25 వరకు స్లాట్ నమోదు చేసుకున్న అభ్యర్థులకు ధృవపత్రాల పరిశీలన జరుగుతుంది. ధృవపత్రాలను పరిశీలించుకున్న అభ్యర్థులు అంతర్జాలంలో ఈ నెల 22 నుంచి 27 వరకు కాలేజీలను ఎంపిక చేసుకోవాలి. ఈ నెల 28 నుంచి 30 లోపు సీట్ల కేటాయింపు జరుగుతుంది. సీట్ల కేటాయింపు జరిగిన అభ్యర్థులు ఈ నెల 30 నుంచి జూలై 4 వరకు సంబంధిత కాలేజీలో సెల్ఫ్ రిపోర్టింగ్, ఫీజు చెల్లింపు ఉంటుంది. చివరి విడతగా జూలై 7న కౌన్సిలింగ్ ప్రారంభమై 16న ముగుస్తుంది. మెదక్, సంగారెడ్డి, రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాల కేంద్రాలలో కౌన్సిలింగ్ ప్రక్రియ ఈ నెల 22 నుంచి ప్రారంభం కానుంది



ఓ పార్టీకి తొత్తులుగా పనిచేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తెవొద్దు

- కాంగ్రెస్ నాయకుడు చక్రధర్ గౌడ్



నవతెలంగాణ-సిద్దిపేట

ఓ పార్టీకి తొత్తులుగా పనిచేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి కొంతమంది పోలీసులు చెడ్డపేరు తేవొద్దని కాంగ్రెస్ నాయకుడు గాదగోని చక్రధర్ గౌడ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 చిన్నకోడూరు మండలం పరిధిలో జరిగిన ఓ వృద్ధురాలి మృతి కేసులో విచారణ సాగుతున్న తీరును తప్పుబట్టారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న చంద్రశేఖర్ పేరిట ఆయన తల్లి (మృతి చెందిన వృద్ధురాలు) 2022లోనే ఆస్తి రిజిస్ట్రేషన్ చేసిందని, ఆస్తి తగాదాలు లేవన్నారు. ఆస్తి విషయంలో దాయాదులు వివాదం కొనసాగుతుండగా ఆవిషయం కోర్టులో ఉందన్నారు. ఇదిలాఉంటే తనపై ఉన్న కక్ష్యతో కొందరు పోలీసులు తన అనుచరుడు చంద్రశేఖర్‌ను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కేసు విషయంలో అనుమానాలు ఉన్నాయని, వన్ టౌన్, ఏసిపి, రూరల్ సిఐ పోలీస్ స్టేషన్‌లో సీసీ ఫుటేజ్‌లు కావాలని సిపి అనురాధను కలిసి కోరినట్లు తెలిపారు. హైదరాబాదులో డిజిపికి కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ దృష్టికి తీసుకెళ్లి నిష్పాక్షిక విచారణ జరిగే విధంగా ఎంక్వైయిరీ చేయించాలని కోరనున్నట్లు తెలిపారు. కేసులు చక్రధర్ గౌడ్ కు కొత్తవి కావని, చట్టప్రకారం ఎదుర్కొవడానికి సిద్దంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్, భాను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కొనుగోలుపై సీఎంకు అవగాహన లేదు

- ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి



నవతెలంగాణ -గజ్వేల్

విద్యుత్ కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డికి ఏమాత్రం అవగాహన లేదని అలాంటప్పుడు మాజీ సీఎం కేసీఆర్‌పై నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నారని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి మండిపడ్డారు. మంగళవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చత్తీస్‌గఢ్ నుంచి 2014 తర్వాత తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావంతో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ కోతను దృష్టిలో పెట్టుకొని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక విద్యుత్ యూనిట్‌ను రూ 3.90 పైసలకు కొనుగోలు చేసి రైతులకు, ఇంటి అవసరాలకు, పరిశ్రమలకు 24 గంటల కరెంటు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కు ఉందన్నారు. చత్తీసగడ్ నుంచి ఇక్కడి వరకు విద్యుత్ సరఫరా చేసేదాన్ని బట్టి ఖర్చులు ఉంటాయన్నారు. అవగాహన లేని కాంగ్రెస్ ప్రభుత్వం తీరువల్ల ఇప్పుడు ప్రజలు, రైతులు కరెంటు కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. కరెంటు ఇవ్వడం లేదని మండిపడ్డారు. రబీలో పంటలు ఎండిపోయాయి ఇప్పుడు కరెంటు రావడం లేదని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ బావుల వద్ద, గృహాలకు, పరిశ్రమలకు గంటల తరబడి కరెంటు నిలిపి వేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంకు వచ్చినా స్కాములు స్కీములు తప్ప ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏడు నెలల్లోనే దివాలా తీసిందన్నారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి మల్లేశం, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ యుడెం కృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి ఎల్లయ్య, నాయకులు నవాజ్ మీరా, విరాసత్, కౌన్సిల్ సభ్యులు ఉప్పల మెట్టయ్య, అత్తిలి శ్రీనివాస్, అల్వాల బాలేష్, చందన రవీందర్, భాగ్యలక్ష్మి దుర్గ ప్రసాద్, మాజీ సర్పంచ్ దయాకర్ రెడ్డి, ఉమర్, నర్సింగరావు, అజీజ్, మద్ది నరేందర్, శ్రీగిరిపల్లి యాదగిరి, హైమద్, కాసిం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి జన్మదిన వేడుకలు





నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న. రాజమౌళి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్, ఆర్యవైశ్య సంఘం, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ సీతారామ ఉమామహేశ్వర, వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అంగడిపేట హనుమాన్ దేవాలయంలో ఆంజనేయ స్వామి వారికి అర్చన, విశేష పూజలు నిర్వహించి భక్తులకు పులిహెూర పంపిణీ చేశారు. జన్మదినం సందర్భంగా రాజమౌళి కుటుంబ సభ్యులతో కలిసి యాదగిరిగుట్టలో నర్సింహ్మస్వామిని ప్రత్యేక దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, యువ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డిలు మాట్లాడుతూ రాజమౌళి జన్మదినాన్ని అట్టహాసంగా నిర్వహించడం జరిగిందన్నారు. పట్టణాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ రహీమ్, అర్చన శివకుమార్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ పట్టణ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్, యువజన అధ్యక్షుడు కొమరవెల్లి శ్రవణ్, నాయకులు అమర నాగేందర్, అయిత సత్యనారాయణ, ఉత్తునూరి సంపత్, దొంతుల సత్యనారాయణ, నాగేంద్రం, నోముల మహేందర్, ఆరిఫ్, కొమరవెల్లి ప్రవీణ్, బాలేష్, బ్రహ్మనపల్లి బిక్షపతి, ఉమేష్‌కైలాస ప్రశాంత్, శేఖర్, నరేందర్ రెడ్డి, గందే సంతోష్, సంజయ్, వినయ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ధరలు వెంటనే తగ్గించాలి

- మహిళలకు భద్రత కల్పించాలి
- ఐద్వారాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత డిమాండ్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని, సమాజంలో మహిళలకు రక్షణ కల్పించాలని, ఆరు గ్యారెంటీలు వెంటనే అమలు చేయాలని ఐద్వారాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత డిమాండ్ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఐద్వా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశంలో సింగిరెడ్డి నవీన అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత హాజరై మాట్లాడుతూ మహిళాలకు రక్షణ లేదన్నారు. అనేక చోట్ల అత్యాచారాలు జరుగుతుంటే వాటిని అరికట్టకుండా మరో వైపు భారతమాత ముద్దు బిడ్డలం అని చెప్పుకునే వారు మాతృమూర్తులను అగౌరవ పరచడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. ఇప్పటికైనా పటిష్టమైన చట్టాలు తెచ్చి కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తిలో సగభాగంగా ఉన్న వాటిలో సగభాగం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. వారికి రక్షణ కరువైందన్నారు. పని ప్రదేశాల్లో వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వాలకు ఉందన్నారు. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. అలా రక్షణ కల్పించినప్పుడు మాత్రమే స్త్రీలకి మనం ఇచ్చే గౌరవమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి అత్తిని శారద, జిల్లా కమిటీ సభ్యులు శోభ, శిరీష, మానస, శోభ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం కలవకుండా చెట్ల తొలగింపు





నవతెలంగాణ-మిరుదొడ్డి

ఏపుగా పెరిగిన చెట్లతో, విద్యుత్ అంతరాయం కలుగుతుందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకురావడంతో విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని లింగుపల్లి గ్రామంలో విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకురావడంతో అధికారులు విద్యుత్ వైర్ల కింద ఏపుగా పెరిగిన చెట్లను నరికివేశారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో గ్రామంలో తీవ్ర విద్యుత్ సమస్య ఏర్పడుతుందన్నారు. గతంలో హరితహారంలో భాగంగా నాటిన చెట్లు ఏపుగా పెరిగి విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. గ్రామస్తుల సహకారంతో విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్లను నరికివేసి విద్యుత్‌ను నిరంతరంగా గ్రామానికి అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస రెడ్డి, లైన్‌మెన్ కరుణాకర్, సిబ్బంది రమేష్ పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులను ఆకట్టుకుంటున్న సాయి జీడిఆర్ గ్రీనరీ



నవతెలంగాణ. గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో సాయి జీ.డి.ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రీనరీ పార్క్ విద్యార్థిని విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఎంతో ఆకట్టుకుంటుంది. ప్రత్యేక గ్రీనరీకి పైపులు వేసి తీరొక రంగులను అద్దడంతో గ్రీనరికి షో వచ్చిందని తల్లిదండ్రులు పాఠశాల వద్ద చర్చించుకోవడం కనిపించింది. గజ్వేల్ పట్టణంలో సంతోష్ సినిమా థియేటర్, టీవైఆర్ గార్డెన్ వైపులో సొంత స్థలంలో సాయి జిడిఆర్ పాఠశాలను సోమేశ్వర్ రెడ్డి ఏర్పాటు చేశారు. కొన్ని సంవత్సరాలుగా ఈ పాఠశాల మంచి ఫలితాలు అందించడమే కాకుండా పాఠశాలకు వచ్చే విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కాస్త సేద తీర్చుకునేందుకు ఈ పార్కు ఎంతో ఆకట్టుకుంటుంది. పాఠశాలలో రైలు డబ్బాల రూపంలో ఏర్పాటు చేసిన తరగతి గదులు చిన్నారులను ఆకట్టుకుంటుంది చిన్నారులకు ఆటల కోసం ఉయ్యాల, జారుడు నిచ్చెన ఏర్పాటు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు అక్కడక్కడ పార్కులో కూర్చొని సేద తీర్చుకునేందుకు బెంచీలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మొక్కలు నాటడంతో అక్కడికి వచ్చే విద్యార్థిని తల్లిదండ్రులకు ఆరోగ్యంగా, మనశ్శాంతిగా కలిగే విధంగా ఉంది.

చెరువు తూమును ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



నవ తెలంగాణ-సిద్దిపేట

మున్సిపల్ పరిధిలోని 1వ వార్డ్ లింగారెడ్డి పల్లిలోని తిమ్మలకుంట చెరువు తూమును ఈ నెల 16వ తేదిన కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారని, వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ ఆలయ కమిటీ అధ్యక్షులు బోనాల ఉప్పలయ్య, ఉపాధ్యక్షులు తాటికొండ రమేష్ లు అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు, నీటి పారుదల శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లో తమ కులస్తుల భూములు పూర్తిగా కోల్పోవడం జరిగిందని, ముదిరాజ్ కులస్తుల జీవన ఆధారం చెరువు పైన , మత్స సంపదపై ఆధారపడి జీవిస్తున్నమని చెప్పారు. కానీ కొందరు గ్రామ స్తులు తూమును ధ్వంసం చేశారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కీసరి వేణు, తాటికొండ శేఖర్, కదర్ల రాజు, తాటికొండ లక్ష్మయ్య, కదుర్ల రవి, తాటికొండ శ్రీనివాస్, తాటికొండ లక్ష్మణ్, తాటికొండ యాదగిరి, తాటికొండ నర్సిములు, బొండ్ల రమేష్, బోనాల అమరేందర్, బోండ్ల సంజీవులు, కిసరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై నోరు పారేసుకోవడం ప్రతాపరెడ్డికి తగదు

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్



నవతెలంగాణ-గజ్వేల్

బీజేపీపై నోరు పారేసుకోవడం ప్రతాప్ రెడ్డికి తగదని బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ, బీజేపీ నాయకులపై నోరు పారేసుకోవడం ఆయనకు తగదన్నారు. బీఆర్ఎస్‌ను ప్రజలు చిత్తుగా ఓడించిన బీఆర్ఎస్ నాయకులకు అహంకారం ఇంకా తగ్గలేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు గజ్వేల్‌లో ఉన్న పెండింగ్ పనుల మీద దృష్టి పెట్టి ఉంటే గజ్వేల్‌కి ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చిన ఉండేది కాదన్నారు. రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఘోరంగా తయారైన గల్లి రోడ్లు, పేదలకు డబుల్ బెడ్ రూమ్‌ల పంపిణీ, ప్రజలకు అందుబాటులో లేని బస్టాండ్, అసంపూర్తి పనులు, ఆలోచన లేని నిర్మాణాలు బానిసత్వపు మనస్తత్వంతో గజ్వేల్ అభివృద్ధిని అందలం ఎక్కించడంలో విఫలమైన ఈ నాయకులు అధికారం పోయాక మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

బాల బ్రహ్మంకు స్వర్ణ కంకణ ధారణ



నవతెలంగాణ-కొండపాక

వాస్తు జ్యోతిష్య పూరోహితం, రాజకీయ కళా రంగంలో నైపుణ్యం విశిష్టత సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకుగాను కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బి. బాలబ్రహ్మంకు స్వర్ణ కంకణ ధారణ చేశారు. వరంగల్ హన్మకొండ ప్రెస్ క్లబ్‌లో తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్టు ఫౌండర్ గౌరి శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో స్వర్ణ కంకణ ధారణతో పాటు తలపాగ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట శాసనసభ్యులు నాగరాజు దేవాదాయ ధర్మాదాయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ అర్చక పూరోహిత సంఘం ప్రధాన కార్యదర్శి పెండోట ప్రభాకర చారి బ్రహ్మచారి, సురేష్ చారి, శ్రీనివాస్ చారి, చంద్రశేఖర్ చారి పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన సదస్సు



నవతెలంగాణ-వర్గల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ నిర్వహణ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ నెల 20 నుంచి 27 వరకు జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలు జరుగుతాయని మండల వైద్య అధికారిని డాక్టర్ హరిత తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరికి నులిపురుగుల నివారణ మందులు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ జాలిగామ లత, జెడ్పీటిసి బలమల్లు యాదవ్, ఎంపీఓ, ఐకేపీ సత్యనారాయణ, డాక్టర్ శిరీష, సీహెచ్ఓ ఈశ్వరమ్మ, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

21న దుకాణాల వేలం

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న దుకాణాల సముదాయంలోని 17 దుకాణాలకు ఈ నెల 21న వేలం నిర్వహించన్నట్టు ఎంపీడీఓ లక్ష్మప్ప మంగళవారం తెలిపారు.గ్రామ పంచాయతీలో ఎలాంటి పన్నులు బకాయి లేకుండా ఆసక్తి ఉన్నవారు రూ.35 వేలు ధరవాతుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని ఎంపీడీఓ లక్ష్మప్ప తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సీఎం చిత్ర పటాల పంపిణీ



నవ తెలంగాణ-మిరు దొడ్డి

ప్రభుత్వ కార్యాలయాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎంపీపీ సాయిలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేశం అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటాలను అధికారులకు అందజేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటాలను ఏర్పాటు చేసే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడిచినప్పటికీ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలను నేటికీ ఏర్పాటు చేయకపోవడం సరైంది కాదన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంతో పాటు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చిత్రపటాలను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూమా గౌడ్, కనకారెడ్డి, మల్లేశం, నర్సింలు, పలువురు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

అప్పుల బాధ తాళలేక వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందిన సంఘటన హుస్నాబాద్ పట్టణ శివారులో మంగళవారం చోటుచేస్తుంది. స్థానికులు తెలిపిన ప్రకారం పట్టణంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన చెన్నూరు సమ్మయ్య (40) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం రాత్రి ఇంటి వద్ద అప్పులు ఎలా తీర్చాలని భార్య భర్తల మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమ్మయ్య మోడల్ స్కూల్ సమీపంలో చెట్టు కు ఊరి వేసుకొని ఆత్మహత్య చేస్తున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

అల్బెండోజోల్ మాత్రలను జాగ్రత్తగా పంపిణి చేయాలి

- అదనపు జిల్లా వైద్యాధికారి వినోద్ బాబ్జీ
- మాత్రల పంపిణీపై సిబ్బందికి అవగాహన



నవతెలంగాణ-బెజ్జంకి

రేపు మండల వ్యాప్తంగా చిన్నారుల పిల్లలకు చేయనున్న అల్బెండోజోల్ మాత్రల పంపిణీలో జాగ్రత్తలు పాటించాలని అదనపు జిల్లా వైద్ధాధికారి వినోద్ బాబ్జీ వైద్య,అంగన్వాడీ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ కార్యాలయంలో అల్బెండోజోల్ మాత్రల పంపిణీపై అదనపు జిల్లా వైద్యధాకారి వినోద్ బాబ్జీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీపీ నిర్మల,తోటపల్లి వైద్యాధికారి క్రిష్ణ తేజ్, బెజ్జంకి,తోటపల్లి ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, అయా గ్రామాల అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు హజరయ్యారు.

ఆశా మృతికి ఘన నివాళులు

గూడెం గ్రామ ఆశా కార్యకర్త తాడూరి విజయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతిపై ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ నిర్మల, అదనపు జిల్లా వైద్యాధికారి వినోద్ బాబ్జీ, అయా ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, అంగన్వాడీ ఉపాధ్యాయులు మౌనం పాటించి ఘన నివాళులర్పించారు.

నులిపురుగు వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం



నవ తెలంగాణ- రాయపోల్

జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని దౌల్తాబాద్, ఇందుప్రియాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ కిరణ్ లు అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నులి పురుగుల నివారణ ప అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు వాడటం వలన బాలబాలికలు రక్తహీనత, కడుపునొప్పి నుంచి కాపాడగలుగుతామని, అలాగే వారి ఎదుగుదలకు ఈ మాత్రలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు నిత్యం తీసుకునే ఆహారంలో సగభాగం ఈ నులిపురుగుల తీసుకుంటాయని, వాటి ద్వారా పిల్లలు అస్వస్థతకు గురవుతారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, మనమందరం ఆరోగ్యంగా ఉంటే ఏ పనైనా చేయగలమన్నారు. విద్యార్థులు అందరూ తప్పనిసరిగా మాత్రలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నర్సమ్మ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడి టీచర్, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనికి కాదు బడికి పంపాలి

- దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

బడి ఈడుకు వచ్చిన పిల్లలందరినీ పనులు చేయడానికి కాకుండా బడికి పంపి విద్యానందించేలా చూడాలని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం మండలంలోని తుక్కాపూర్ గ్రామ పంచాయతీలోని కాశ గుడిసెల కాలనీలో చెరుకు శ్రీనివాస్ రెడ్డి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశగుడిసెల కాలనీలో మంచినీటి సమస్య పరిష్కారానికి లోకసభ ఎన్నికలకు ముందే 40 వేల నీటి సామర్థ్యం గల ఓవర్ హెడ్ టాంక్ నిర్మాణం కోసం రూ.30 లక్షలు, బోర్ మోటర్ కోసం 2 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ. 5 లక్షల మంజూరు చేశామని, మరిన్ని రోడ్లు కావాలని కాలనీ ప్రజలు తనను కోరారన్నారు. వాటి కోసం సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహ, ఇంచార్జి మంత్రి కొండా సురేఖ ల సహకారంతో మరో రూ. 15 లక్షల నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన ట్యాంక్ నిర్మాణం అయ్యే వరకు నీటి ఎద్దడి తీర్చాలని కోరగా తొగుట ఎంపి పి గాంధారి లతా నరేందర్ రెడ్డి ఎంపిపి నిధుల నుంచి రూ. 40 వేల విలువగల నూతన బోర్ పంపు ఇప్పించడం జరిగిందన్నారు. కాలనీ వాసులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేని పక్షంలో సీజనల్ వ్యాధులు ప్రభాలి అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. తుర్కకాశ గుడిసెల కాలనీ అభివృద్ధికి సహకరిస్తానని, అభివృద్ధిలో అగ్ర గామిగా నిలుపుతానని హామీ ఇచ్చారు. గతంలోనే తొగుట మండలంలో పలు అభివృద్ధి పనులకు సుమారు 3 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశామని గుర్తు చేశారు. ఆ పనులు త్వరితగతిన పూర్తి చేస్తే మరిన్ని నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి బాట పట్టిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గాంధారి లతా నరేందర్ రెడ్డి, దుబ్బాక నియోజక వర్గ కోర్డినేటర్ చెరుకు విజయ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి కనకయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లింగాల కృష్ణ, నాయకులు విజయ పాల్ రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉల్లెంగల సాయి కుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పలయ్య, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బి. స్వామి, గోపాల్, లింగాల స్వామి, మోదిన్, అమీర్, సాహు హుస్సేన్, బాబా, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణతో పిల్లలకు బంగారు భవిష్యత్తు

- ఏఎన్ఎం సారమ్మ



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో ఏఎన్ఎం సారమ్మ, హెల్త్ అసిస్టెంట్ కొమురయ్య ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నట్టల నివారణ కావాలంటే తప్పకుండా 10 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పకుండా మాత్రలు వేయాలన్నారు. దీనివల్ల విద్యార్థుల్లో కడుపునొప్పి, వికారం వంటివి తగ్గిపోయి చురుకుగా ఉంటారని తెలియజేశారు. అలాగే సీజనల్ వ్యాధులైన మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను తప్పనిసరిగా శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి తొట్లలో నీళ్ళు నిలువ ఉంచరాదన్నారు. దీనివల్ల దోమలు విపరీతంగా పెరిగి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కాబట్టి మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం జ్యోతి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం వెంకటరమణారెడ్డి, ఎమ్ ఎల్ హెచ్ పీ విజయ, తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న గృహ జ్యోతి లబ్ధిదారులు

- మాకు ఆప్షన్ లేదంటున్న విద్యుత్ అధికారులు
- ఎడిట్ ఆప్షన్ లేదంటున్న మండల అధికారులు



నవతెలంగాణ- కొమురవెల్లి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలలో ఆరు గ్యారెంటీల పథకం ఒకటి అందులో గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు వాడే విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందించాలి. కొంతమందికి జీరో బిల్లులు రావడంలేదని రూ.500 లకే గ్యాస్ సిలిండర్ పథకం కింద అకౌంట్ లో డబ్బులు పడడం లేదని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు మంగళవారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. లబ్ధిదారులకు కార్యాలయ సిబ్బంది అధికారులు తమ కంప్యూటర్లో ఎడిట్ ఆప్షన్ లేదని తిప్పి పంపిస్తున్నారు. విద్యుత్ కార్యాలయానికి వెళితే ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లాలని ఇక్కడికి వస్తే ఎడిట్ ఆప్షన్ లేదని చెప్తున్నారని లబ్ధిదారులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు ఎన్నికల కోడ్ ఉందని చెప్పి ఇప్పుడేమో ఎడిట్ ఆప్షన్ మాకు లేదని చెప్పడంతో లబ్ధిదారులు ఏమి చేయాలో అర్థం కాక వెనుతిరిగారు. కారణమేదైనా మండలంలో కొంతమంది లబ్ధిదారులకు గృహజ్యోతి స్కీమ్, గ్యాస్ సిలిండర్ డబ్బులు అందకుండా పోతున్నాయి. ఉన్నతాధికారుల స్పందించి సాంకేతిక లోపాలను సరిచేసి తమకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.



పిల్లలలకు నులిపురుగుల నివారణ మాత్రలు తప్పని సరి



నవతెలంగాణ-జగదేవపూర్

పిల్లలకు నులిపురుగల నివారణ మాత్రలు వేయించడం తప్పనిసరి అని మండల అధ్యక్షుడు బాలేశం గౌడ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బాలేశం గౌడ్ అధ్వర్యంలో జాతీయ నులిపురుగల నివారణ గురించి మండల లెవెల్ టాస్క్ ఫోర్స్ మీటింగ్, అంగన్ వాడి కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు తప్పకుండా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ సి వైద్యాధికారి డాక్టరు సత్యప్రకాష్ తిగుల్ వైద్యాధికారి డాక్టరు రాజశేఖర్ గౌడ్, ఎం.పి.డి.ఓ యాదగిరి ఎం.పి.టి.సి కొత్త కవిత శ్రీనివాస రెడ్డి, ఎంఈఓ ఉదయభాస్కర్ రెడ్డి, మోడెల్ స్కూలు ప్రిన్సిపల్ సెల్వరాజ్, పి.హెచ్.సి.హెచ్.ఓ శ్రీమతి, హెల్త్ అసిస్టెంట్ జితెందర్ రెడ్డి, అన్ని గ్రామల అంగన్ వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ జమదగ్నిల కల్యాణ మహోత్సవం

నవ తెలంగాణ-రాయపోల్

రాయపోలు మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి జమదగ్ని కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజులు వేద పండితులు చేత కళ్యాణ మహోత్సవం నిర్వహించడానికి దేవస్థానాన్ని రంగురంగులతో విద్యుత్ కాంతలతో ముస్తాబు చేశారు. మూడవ రోజు మంగళవారం తెల్లవారు జామున ఉ. 3-00 గం.ల నుంచి శ్రీ రేణుక ఎల్లమ్మకు బోనాలు నిర్వహించబడును. మంగళవారం 18 వ తేదీన ఉ. గం.11-35 ని.లకు అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తమున శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి-జమదగ్ని కళ్యాణం వేద పండితులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరిగింది. ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాయపోల్ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.



నాయిబ్రాహ్మణ సేవాసంఘం జిల్లా అధ్యక్షునిగా నరేందర్



నవ తెలంగాణ-సిద్దిపేట

నాయిబ్రాహ్మణ సేవాసంఘం జిల్లా అధ్యక్షునిగా కొత్వాల్ యాదనరేందర్ ఎన్నికయ్యారు. నాయిబ్రాహ్మణ సేవాసంఘం సిద్దిపేట జిల్లా ఎన్నికలు మంగళవారం జిల్లా నిర్మాణ కమిటీ, ఎలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శి గా కొండూరి సతీష్ కుమార్, కోశాధికారిగా కొండూరి రాజ్ కుమార్‌లు ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు యాద నరేందర్ మాట్లాడుతూ నాయిబ్రాహ్మణ సంక్షేమం కోసం గ్రామాల్లోని నాయి బ్రాహ్మణ కుటుంబాలకు సంక్షేమ ఫలాలను అందించే విధంగా ఈ నాయకత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులుగా సింగిరాల కనకయ్య, సింగిరాల శ్రీనివాస్, కొత్వాల చంద్రం, జంపాల విజయ్ కుమార్, మొలంకల శ్రీనివాస్, కొండూరి అరవింద్ కుమార్, శ్రీరామ్ బాల నర్సయ్య, కొత్వాల్ కిషన్, సూరంపల్లి గౌతమ్, దుంపల బాలా పోచయ్య మండలాల నాయకులు పాల్గొన్నారు.

వర్షం కోసం బతుకమ్మ ఆడి పూజలు చేసిన రైతులు



నవతెలంగాణ-తొగుట

వేసిన విత్తనాలు మొలకెత్తిక పోవడంతో వర్షుని కరుణ కోసం రైతులు బతుకమ్మ ఆడి, ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో తాటోనికుంటా ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలతో పాటు రైతులు వర్షాలకోసం బతుకమ్మ ఆడుతూ వాన దేవుని పాటలు పాడారు. వర్షాకాలం ప్రారంభమైన సరైన వర్షాలు కురువక పోవడంతో ఉపాధి హామీ కూలీలు, వేసిన విత్తనాలు మొలకెత్తక పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతు భరోసా ఇస్తామని ప్రకటించి అధికారంలోకి రాగానే మాట నిలబెట్టుకోలేదన్నారు. ఇప్పటి కైనా రాష్ట్ర ప్రభుత్వం రైతు

రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- వ్యవసాయ అధికారి మల్లేశం



నవ తెలంగాణ-మిరుదొడ్డి

సాగుకు సరిపడా ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి మల్లేశం అన్నారు. అన్నదాతలు అధైర్య పడాల్సిన అవసరం లేదని సూచించారు. మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో విక్రయిస్తున్న ఎరువులను వ్యవసాయ అధికారి మల్లేశం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు విక్రయిస్తున్న తీరును తెలుసుకోవడంతో పాటు రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు రైతులకు సరిపడా అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలో వరి, పత్తి ,మొక్కజొన్న సాగు ఎక్కువగా కొనసాగుతున్న నేపథ్యంలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్కడైనా నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి సాయికుమార్ ,సీఈవో రాజు పలువురు పాల్గొన్నారు.

మెదక్ ఎంపీకి శుభాకాంక్షలు

- బీజేపీ మండల ఉపాధ్యక్షులు చుంచనకోట నరేష్ గౌడ్

నవతెలంగాణ-రాయపోల్

ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికలలో మెదక్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీజేపీ పార్టీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు గెలుపొందడంతో రాయపోల్ మండల బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశామని బీజేపీ మండల ఉపాధ్యక్షులు చుంచనకోట నరేష్ గౌడ్ అన్నారు. మంగళవారం ఎంపీ రఘునందన్ రావు నివాసంలో కలిసి బీజేపీ నాయకులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకసభ ఎన్నికలలో రాష్ట్ర అధికార పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ ఎన్నికలలో గెలవడానికి ఎన్నో మాయ మాటలు చెప్పి, ఎన్నో ప్రలోభాలకు గురి చేసినగాని మెదక్ నియోజకవర్గ ప్రజలు వాటికి లొంగకుండా బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావును గెలిపించడం హర్షించదగ్గ పరిణామం. నరేంద్ర మోడీ నాయకత్వంపై దేశ ప్రజలకు నమ్మకం ఉంది కాబట్టే మూడోసారి అధికారాన్ని కట్టబెట్టడం జరిగిందన్నారు. మెదక్ నియోజకవర్గం అభివృద్ధి కోసం నరేంద్ర మోడీ నాయకత్వంలో ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మంతురు ప్రభాకర్ రెడ్డి, రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీల చంద్రం తదితరులు పాల్గొన్నారు.

